క్లుప్తంగా

మర్యాదపూర్వక భేటీ



తమ్మినేనిని సత్కరిస్తున్న రిషీశ్వరరావు

ఆమదాలవలస: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ జనరల్ సెక్రటరీగా నియామకమైన పొన్నాడ రిషీశ్వరరావు మాజీ స్పీకర్, పార్టీ రాష్ట్ర రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యుడు తమ్మినేని సీతారాంను ఆమదాలవలసలోని ఆయన నివాసం వద్ద శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కష్టపడి పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్యాలు పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న ఎంఈవో రాంబాబు

హిరమండలం: ఉపాధ్యాయులు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల్లో వృత్తి నైపుణ్యాలు పెంపొందించుకోవాలని ఎంఈవో కె.రాంబాబు సూచించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సిలబస్‌లు సకాలంలో పూర్తి చేసేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం రిసోర్స్ పర్సన్లు ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ టి.కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

గంబూషియా చేపలు విడుదల



చెరువులో చేపలు విడిచిపెడుతున్న దృశ్యం

హిరమండలం: దోమల లార్వాను నాశనం చేయడంలో గంబూషియా చేపలు ఎంతగానో దోహదపడతాయని ఎల్ఎన్‌పేట, హిరమండలం పీహెచ్‌సీల వైద్యాధికారులు పాపారావు, సాయికుమార్ అన్నారు. ఎల్ఎన్‌పేట మండలంలో తురకపేట గ్రామంలోని కోనేరు చెరువులో, హిరమండలంలోని సాగిజోలు చెరువులో గంబూషియా చేపలను శనివారం విడిచిపెట్టారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది భాస్కరరావు, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పాలపోలమ్మ సన్నిధిలో జడ్జి ఫణికుమార్



జడ్జి ఫణికుమార్‌ను సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ఆమదాలవలస: పట్టణ గ్రామదేవత పాలపోలమ్మ అమ్మవారిని జిల్లా అదనపు జడ్జి ఎస్.ఎం.ఫణికుమార్, స్థానిక జూనియర్ సివిల్ జడ్జి బి.రమ్య శనివారం దర్శించుకున్నారు. వారిని ఆలయ పాలకవర్గ ప్రతినిధులు సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆలయ పురోహితులు ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



విద్యార్థులకు హోమియో మాత్రలు పంపిణీ చేస్తున్న దృశ్యం

పాతపట్నం: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని తెంబూరు హోమియో ఆస్పత్రి వైద్యురాలు ఎస్.ఉమాగౌరి సూచించారు. శనివారం తెంబూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు హోమియో మందులను పంపిణీ చేశారు. విద్యార్థులు కాచి చల్లార్చిన నీటిని తాగాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

పొందూరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డా.సీహెచ్ మధుసూదనరావు తెలిపారు. కళాశాలలో బీఎస్సీ, బీఏ, బీకాం వంటి పలు కోర్సులను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇంతవరకు డిగ్రీ ప్రథమ సంవత్సరంలో రిజిస్ట్రేషన్ చేసుకోని విద్యార్థులు, అర్హత పత్రాలతో సెప్టెంబర్ 1వ తేదీ సాయంత్రంలోగా కళాశాల ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలని కోరారు.

కదిలిస్తే కష్టమవుతుంది..!



శ్రీకాకుళం జిల్లాలోనే కొనసాగించాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న ప్రజాప్రతినిధులు

- కొత్త జిల్లా ఏర్పాటుపై పాతపట్నం నియోజకవర్గం ప్రజల ఆందోళన
- శ్రీకాకుళంలోనే కొనసాగించాలని వినతులు
- పలాసలో కలిపితే వ్యయప్రయాసలు తప్పవని ఆవేదన



మంత్రులకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

హిరమండలం: కూటమి ప్రభుత్వం కొత్త జిల్లాల ఏర్పాటుపై దృష్టి పెట్టింది. అలాగే ఉన్నవాటి పేర్ల మార్పు, డివిజన్లు, మండలాల్లో చేర్పులు, మార్పులు వంటి వాటిని అధ్యయనం చేసేందుకు మంత్రులతో కూడిన క్యాబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసింది. ఉత్తరాంధ్ర నుంచి ఈ కమిటీ అధ్యయనం చేయనుంది. ప్రజల నుంచి వినతులు స్వీకరించనుంది. అంతకంటే ముందే మండల, నియోజకవర్గ స్థాయిలో వినతులు అందించేందుకు అవకాశం కల్పించింది. అటు జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రాలు అందించేందుకు సైతం ప్రభుత్వం అనుమతించింది. అయితే శ్రీకాకుళం జిల్లాకు సంబంధించి కలెక్టర్‌కు ఎక్కువగా పాతపట్నం నియోజకవర్గం నుంచి వినతులు రావడం విశేషం. శ్రీకాకుళం జిల్లా ఆవిర్భావం నుంచి ఇదే జిల్లాలో కొనసాగుతున్నామని.. తమను ఇదే జిల్లాలో కొనసాగించేలా చూడాలని హిరమండలం, కొత్తూరు, ఎల్ఎన్‌పేట, పాతపట్నం మండలాల నుంచి ఎక్కువగా వినతులు వస్తున్నాయి.

పలాస జిల్లాపై ప్రచారం

ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి, పాతపట్నం నియోజకవర్గాలతో కలిపి కొత్తగా పలాస జిల్లాను ఏర్పాటు చేస్తారని ఎక్కువగా ప్రచారం జరుగుతోంది. ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాల ప్రజలు తమకు పాలనా సౌలభ్యం కోసం ప్రత్యేక జిల్లాను ఏర్పాటు చేయాలని కోరుతూ వస్తున్నారు. దీంతో కూటమి ప్రభుత్వం పలాస జిల్లా ఏర్పాటుకు సానుకూలంగా ఉందని పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. దీనిపై టీడీపీ కూటమి నేతలు సైతం ఆర్భాటం చేస్తున్నారు. దీంతో పాతపట్నం నియోజకవర్గ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. భౌగోళికంగా, రవాణా పరంగా, రాజకీయపరంగా ఎంత మాత్రం తమకు ఆమోదం కాదని చెబుతున్నారు. పలాస జిల్లా ఏర్పాటు చేస్తామంటే తమకు అభ్యంతరం లేదని.. కానీ ఆ జిల్లాలో పాతపట్నం నియోజకవర్గాన్ని కలపవద్దని కోరుతున్నారు. అదే చేస్తే ప్రజా ఉద్యమానికి తెరతీస్తామని చెబుతున్నారు.

డివిజన్‌తో అవస్థలు

ఇప్పటికే రెవెన్యూ డివిజన్‌తో పాతపట్నం నియోజకవర్గ ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రస్తుతం ఈ ఐదు మండలాలు టెక్కలి రెవెన్యూ డివిజన్‌లో ఉన్నాయి. దీంతో కొత్తూరు, ఎల్ఎన్‌పేట, హిరమండలం మండలాల ప్రజలకు వ్యయప్రయాసలు తప్పడం లేదు. తమను శ్రీకాకుళం రెవెన్యూ డివిజన్‌లో కానీ.. కొత్తగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయడమో చేయాలని కోరుతున్నారు. కానీ ఇప్పుడు మూలిగే నక్కపై తాటిపండు పడిన చందంగా ఎక్కడో పలాస జిల్లాలో కలపడం ఏంటని సామాన్యులు సైతం ప్రశ్నిస్తున్నారు. అటువంటి ఆలోచనను విరమించుకోవాలని కోరుతున్నారు.

దూరా'భారం'

ఎల్ఎన్‌పేట, హిరమండలం, కొత్తూరు మండలాల నుంచి పలాస వెళ్లాలంటే సుమారు 70 కిలోమీటర్ల వరకూ ప్రయాణించాల్సి ఉంటుంది. పైగా రవాణాపరంగా సదుపాయాలు తక్కువ. ఈ మూడు మండలాల ప్రజలు ముందుగా పాతపట్నం చేరుకోవాలి. అక్కడి నుంచి ఒడిశాలోని పర్లాకిమిడి మీదుగా పలాస చేరుకోవాల్సి ఉంటుంది. సరైన బస్సు సదుపాయం కూడా ఉండదు. వీరు బస్సుపై వెళ్లాలంటే శ్రీకాకుళం వెళ్లాలి. అక్కడ నుంచి పలాస చేరుకోవాలి. అలా అయితే 120 కిలోమీటర్లు ప్రయాణించాల్సిందే. అంటే రానూపోనూ 200 కిలోమీటర్ల పైమాటే. అదే జరిగితే జిల్లా కేంద్రానికి వెళ్లి రావాలంటే ఒక రోజు పని. అందుకే పాతపట్నం నియోజకవర్గ ప్రజలు ఎక్కువగా ఆందోళన చెందుతున్నారు. అయితే ఇదే నియోజకవర్గంలోని మెళియాపుట్టి మండలం మాత్రం పలాసకు దగ్గరగా ఉంటుంది. ఆ మండలం తప్పించి మిగతా నాలుగు మండలాల ప్రజలు మాత్రం పలాసలో కలిసేందుకు ఎంతమాత్రం సమ్మతంగా లేరు. తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఒకవేళ ప్రజాభీష్టానికి వ్యతిరేకంగా కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే రాజకీయంగా నష్టం తప్పదు. రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీలు ఏకమవుతున్నాయి. అవసరమైతే ఉద్యమం చేపట్టేందుకు సిద్ధపడుతున్నాయి.

శ్రీకాకుళంలో కొనసాగించాలి



పాతపట్నం నియోజకవర్గాన్ని శ్రీకాకుళం జిల్లాలోనే కొనసాగించాలి. పలాస జిల్లాలో కలిపితే ఊరుకునే ప్రసక్తి లేదు. ఇప్పటికే టెక్కలి రెవెన్యూ డివిజన్‌లో నియోజకవర్గంలోని ఐదు మండలాలు ఉండడంతో వ్యయప్రయాసలకు గురవుతున్నాం. ఇప్పుడు పలాస అంటే మాకు దూరాభారంగా మారుతుంది. ఈ విషయంలో క్యాబినేట్ సబ్ కమిటీ ప్రజాభిప్రాయాన్ని గౌరవించి నిర్ణయం తీసుకోవాలి. ఈ మేరకు ప్రభుత్వానికి నివేదించాం.

– మీసాల రజినీ, ఎంపీటీసీ సభ్యురాలు, హిరమండలం

వ్యయప్రయాసలు తప్పవు



ఎల్ఎన్‌పేట మండలం నుంచి పలాస వెళ్లాలంటే వ్యయప్రయాసలు తప్పవు. దాదాపు 70 కిలోమీటర్లు ప్రయాణిస్తే కానీ చేరుకోలేం. కనీసం రవాణా సౌకర్యం లేదు. అందుకే శ్రీకాకుళం జిల్లాలోనే కొనసాగించాలి. శ్రీకాకుళం రెవెన్యూ డివిజన్‌లోకి మమ్మల్ని మార్చాలి. అవసరమైతే పాతపట్నంను రెవెన్యూ డివిజన్ కేంద్రంగా మార్చితే నియోజకవర్గ ప్రజలకు ఎంతో సౌలభ్యంగా ఉంటుంది.

– పెనుమజ్జి విష్ణుమూర్తి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు, ఎల్ఎన్‌పేట

సీఎం చంద్రబాబువి ఆర్భాటపు ప్రకటనలు



రెడ్డి శాంతి

హిరమండలం: రోడ్ల నిర్మాణాలపై సీఎం చంద్రబాబువి ఆర్భాటపు ప్రకటనలని వైఎస్సార్‌సీపీ క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో ఏ రహదారిని చూసినా ఏమున్నది గర్వకారణం అన్నట్లు పరిస్థితి ఉందని ఎద్దేవా చేశారు. గోతులు పూడ్చడం, కొలతలు తీయడంతోనే 15 నెలల పాలన పూర్తి చేసుకున్నారని చెప్పారు. ఎక్కడికి వెళ్లినా గోతుల రహదారులతో ప్రజలు అవస్థలు పడుతున్నారని మండిపడ్డారు. నియోజకవర్గాల్లో ఆకాశమే హద్దుగా కూటమి పార్టీల శ్రేణులు దోపిడీకి పాల్పడుతున్నాయని ఆరోపించారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని.. వచ్చే ఎన్నికల్లో టీడీపీ కూటమికి గుణపాఠం తప్పదని హెచ్చరించారు.

20 మంది ఎంపిక

పొందూరు: స్థానిక సిస్టం డిగ్రీ కళాశాలలో దివిస్ కంపెనీ ఆధ్వర్యంలో ఉద్యోగాల కోసం శనివారం నిర్వహించిన ఇంటర్వ్యూల్లో 20 మంది ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ మొదలవలస మోహనరావు తెలిపారు. ఇంటర్వ్యూలకు 70 మంది హాజరైనట్లు వెల్లడించారు.

లోక్ అదాలత్‌పై సమీక్ష



సమీక్ష నిర్వహిస్తున్న జడ్జి జ్యోత్స్న

పొందూరు: కోర్టు కేసుల సత్వర పరిష్కారం కోసం సెప్టెంబర్ 13వ తేదీన నిర్వహించనున్న లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని పొందూరు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి బి.జ్యోత్స్న సూచించారు. స్థానిక కోర్టు హాల్‌లో న్యాయవాదులు, పొందూరు, జి.సిగడాం మండలాల పోలీసు అధికారులతో లోక్ అదాలత్‌పై శనివారం సమీక్ష నిర్వహించారు. లోక్ అదాలత్ ప్రయోజనాలపై కక్షిదారుల్లో అవగాహన కోసం త్వరలో పలు గ్రామాల్లో కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు.

కల్యాణ్‌కు అభినందనలు



కల్యాణ్‌ను అభినందిస్తున్న ధర్మాన కృష్ణదాస్

పోలాకి: అమరావతి ఛాంపియన్ షిప్ రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీల పురుషుల విభాగంలో గోల్డ్ మెడల్ సాధించిన ఆరంగి కల్యాణ్‌ను మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ అభినందించారు. ఇటీవల విజయవాడలో జరిగిన ఆర్చరీ పోటీల్లో శ్రీకాకుళం మొదటి స్థానం సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. మబగాంలో జరిగిన కార్యక్రమంలో ఆర్చరీ స్టేషన్ అధ్యక్ష, కార్యదర్శులు లోపింటి చిట్టిబాబు, శివాజీ, తిరుపతిరావులు పాల్గొన్నారు.

న్యూసెన్స్ కేసు నమోదు

హిరమండలం: మేజర్ పంచాయతీ హిరమండలంలోని రెల్లివీధికి చెందిన ఆరుగురు యువకులు శుక్రవారం అర్ధరాత్రి దాటిన సమయంలో మద్యం తాగి వీధుల్లో గొడవ చేశారని వచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం ఆ ఆరుగురు యువకులపై న్యూసెన్స్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎండీ యాసిన్ తెలిపారు.

పరామర్శ



రంగనాథ్ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ధర్మాన ప్రసాదరావు తదితరులు

ఆమదాలవలస: పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త శిల్లా రంగనాథం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో వారి కుటుంబాన్ని మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు శనివారం పరామర్శించారు. ఆయనతో పాటు వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బొడ్డేపల్లి రమేష్‌కుమార్, పార్టీ జిల్లా కార్యదర్శి పొన్నాడ చిన్నారావు, పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు పొడుగు శ్రీనివాసరావు, నాయకులు చీపురు కృష్ణ, ఆరంగి మురళీ, కూన రామకృష్ణ, రామ్మోహన్‌రావు తదితరులు ఉన్నారు.

ఎరువుల ఇబ్బందులు తొలగించాలి



మాట్లాడుతున్న పొన్నాన బాలకృష్ణంనాయుడు

సారవకోట: ఎరువుల కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారని, వాటిని తొలగించాల్సిన అవసరం ఉందని బుడితి పీఏసీఎస్ చైర్మన్ పొన్నాన బాలకృష్ణం నాయుడు అన్నారు. బుడితి పీఏసీఎస్ ఆవరణలో కొత్తగా నియమించబడిన పీఏసీఎస్ చైర్మన్, డైరెక్టర్ల ప్రమాణ స్వీకార కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం రైతులకు యూరియా సరిగా అందడం లేదని, దీనివలన చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇతర దేశాల నుంచి యూరియా దిగుమతి కావాల్సి ఉందని, త్వరలో కొరత లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

సమస్యలతో సతమతం

- కొత్తూరు సీహెచ్‌సీలో వసతులు కరువు
- జనరేటర్ లేకపోవడంతో అవస్థలు
- పూర్తవ్వని అదనపు గదులు
- వరండాలోనే వైద్యమందిస్తున్న వైనం



కొత్తూరు సీహెచ్‌సీ



జనరేటర్ లేకపోవడంతో చిన్నారులను సెల్‌ఫోన్ వెలుతురులో ఉంచిన బాలింతలు(ఫైల్)

కొత్తూరు: ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలోని కొత్తూరు, సీతంపేట, భామిని, హిరమండలం మండలాలకు అందుబాటులో ఉన్న కొత్తూరు ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం సమస్యలతో సతమతమవుతోంది. దీంతో రోగులకు సకాలంలో మెరుగైన వైద్యమందక అవస్థలు పడుతున్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే కొత్తూరు సీహెచ్‌సీని కార్పొరేట్ ఆస్పత్రికి దీటుగా మారుస్తామని కూటమి నేతలు ఎన్నికల్లో మామీ ఇచ్చారు. కానీ దాదాపు 15 నెలలు పూర్తి కావస్తున్నా కనీసం ఆస్పత్రికి జనరేటర్ ఏర్పాటు చేయలేకపోయారు. ఆస్పత్రికి వైద్యం కోసం రోజుకు సుమారు 200 మంది రోగులు వస్తుంటారు. ఇన్ పేషెంట్లుగా రోజుకు సుమారు 25 మంది వైద్యం పొందుతుంటారు. అయితే ఆస్పత్రిలో సరిపడిన గదులు లేకపోవడంతో వరండాల్లో మంచాలు వేసి వైద్యం అందించాల్సిన దుస్థితి నెలకొంది.

చీకటిలోనే రోగులు

ఆస్పత్రికి జనరేటర్ సౌకర్యం లేకపోవడంతో ఇన్వెర్టర్‌తో నెట్టుకొస్తున్నారు. అయితే గంటల తరబడి విద్యుత్ లేకపోతే ఇన్వెర్టర్‌లో చార్జింగ్ అయిపోయాక రోగులు చీకట్లో ఉండాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. అదేవిధంగా ఎక్స్‌రే ప్రాజెక్టు లేకపోవడంతో రోగులు ప్రైవేట్ ల్యాబ్‌లకు వెళ్లి వందలాది రూపాయలు ఖర్చు చేస్తున్నారు. అదేవిధంగా అనస్థీషియన్ లేకపోవడంతో శస్త్ర చికిత్సలు చేయడానికి అవకాశం లేకుండా పోయింది. కనీసం గర్భిణులకు డెలవరి సమయంలో ఆపరేషన్ చేయలేకపోతున్నారు. అలాగే ప్రహరీ లేకపోవడంతో ఆస్పత్రిలోకి కుక్కలు, పందులు, పశువులు వస్తున్నాయి. ఐటీడీఏ పరిధిలో కొత్తూరు సీహెచ్‌సీ ఉన్నప్పటికీ నిధులు రాబట్టుకోవడంలో కూటమి నేతలు విఫలమవుతున్నారు. అందువలన ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో సౌకర్యాలు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మంజూరు చేయలేదు



సీహెచ్‌సీలకు జనరేటర్లను ప్రభుత్వం మంజూరు చేయలేదు. ఇన్వెర్టర్‌లతో వైద్యం అందిస్తున్నాము. విద్యుత్ గంటలు తరబడి రాకపోయినట్లయితే రోగులు ఇబ్బందులు పడుతున్నారు. అదనపు భవనాలు ప్రారంభమైనప్పుడు జనరేటర్‌తో పాటు ఎక్స్‌రే మిషన్ ప్రభుత్వం మంజూరు చేస్తుంది.

– కొత్తూరు అనూరాధ, సూపరింటెండెంట్, కొత్తూరు సీహెచ్‌సీ

ఆమదాలవలస: పూజల్లో పాల్గొన్న మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం



● లంబోదరుడికి పూజలు

ఆమదాలవలస, పాతపట్నం, నరసన్నపేట నియోజకవర్గాల్లో వినాయక చవితి నవరాత్రులు కొనసాగుతున్నాయి. దీనిలో భాగంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. లడ్డూ వేలం పాటల్లో ఆసక్తి ఉన్నవారు ఉత్సాహంగా పాల్గొన్నారు. పూజ మండపాల వద్ద చేపట్టిన దీపారాధనలు ఆకట్టుకున్నాయి. కొన్ని గ్రామాల్లో నిమజ్జనానికి గణనాథులు తరలివెళ్లారు.

– సాక్షి నెట్‌వర్క్



సారవకోట: సహస్ర కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు



పాతపట్నం: కోర్టు కూడలిలో దీపారాధన



హిరమండలం: ఊరేగింపుగా నిమజ్జనానికి వెళ్తున్న దృశ్యం



హిరమండలం: ఎల్ఎన్‌పేట శ్యామలాపురం వద్ద కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

అభివృద్ధి ప్రణాళికలు తయారు చేసుకోవాలి



పాతపట్నం: మాట్లాడుతున్న ఎంపీడీవో చంద్రకుమారి

ప్రతీ గ్రామ పంచాయతీలో అభివృద్ధి ప్రణాళికలు తయారు చేసుకోవాలని అధికారులు సూచించారు. శనివారం వివిధ మండలాల్లోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరాల్లో సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులకు శిక్షణ సమావేశాలు నిర్వహించారు. వర్షాకాలం దృష్ట్యా ప్రజలు ఇబ్బందులు పడకుండా సత్వర చర్యలు చేపట్టాలన్నారు. ప్రజలకు మౌలిక వసతులు కల్పించడంలో ముందంజలో ఉండాలన్నారు. నిధుల వినియోగం, రికార్డుల నిర్వహణలో శ్రద్ధ చూపాలని స్పష్టం చేశారు.

– సాక్షి నెట్‌వర్క్

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి రాణి

కొత్తూరు: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు జూనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవా సంఘం అధ్యక్షురాలు కందికట్ల రాణి అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా పలు చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు ర్యాగింగ్ వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మైనర్లు వాహనాలు నడపడం నేరమని సీఐ ప్రసాదరావు, ఎస్ఐ ఎండీ అమీర్ ఆలీలు తెలియజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ధనుంజయరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అప్పారావు, సభ్యులు పాల్గుణరావు, ధర్మారావు, రాడ రాజు, సుధాకర్, వి.పాల్గునరావు, ప్రసాద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

జంగిల్ క్లియరెన్స్

పొందూరు: పొందూరు–రాజాం, పొందూరు–శ్రీకాకుళం రహదారిలో ప్రధాన రహదారికి ఇరువైపులా శనివారం జంగిల్ క్లియరెన్స్ చేపట్టారు. పొందూరు పంచాయతీ ఆధ్వర్యంలో ఈ పనులు జరిగాయి. ప్రత్యేకంగా శానిటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పనులను డీఎల్‌పీవో గోపీబాల, ఈవోపీఆర్డీ సింహాచలం, ఈవో మోహన్‌బాబులు పరిశీలించారు.

రోడ్డు పనులు ప్రారంభం



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ శంకర్

నరసన్నపేట: మేజరు పంచాయతీ పరిధి పెద్దపేటలో సుమారు రూ.6 లక్షలతో రోడ్డు అభివృద్ధి చేస్తున్నట్లు సర్పంచ్ బూరల్లి శంకర్ తెలిపారు. శనివారం రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎస్.కృష్ణబాబు, వార్డు సభ్యులు కృష్ణప్రసాద్, నాయకులు ముద్దాడ అప్పలనాయుడు, పాగోటి రాజారావు తదితరులు పాల్గొన్నారు.